సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం | 9 | జూన్ | 2023



రక్షణతో విధులు నిర్వర్తించాలి

ఆర్జీ–3 పరిధి అడ్రియాల గనిని గురువారం డీఎంఎస్(మైనింగ్) ఎన్.నాగేశ్వరరావు సందర్శించారు. అనుక్షణం రక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. 8లో▸



పత్తి క్వింటాల్ రూ.6,701

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో గురువారం పత్తి క్వింటాల్ గరిష్ట ధర రూ.6,701 నమోదైంది. కనిష్టం రూ.6,105, సరాసరి రూ.6,652 నమోదైనట్లు ఇన్‌చార్జి కార్యదర్శి సతీశ్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
42.0/30.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి.

బిల్లుల మోత

ఏసీడీ పేరిట చార్జీల వాత





'ఈ బిల్లు రామగుండం కార్పొరేషన్‌కు చెందిన ఓ విద్యుత్ వినియోగదారుడిది. గత మార్చిలో వచ్చిన బిల్లులో లోడ్ పెరిగిందని డెవలప్ మెంట్ చార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్ పేరుతో పైసలు అదనంగా వేశారు. మళ్లీ ఇప్పుడు అడ్వాన్స్ కన్జంప్షన్ డిమాండ్ (ఏసీడీ) చార్జీల పేరుతో ఏకంగా రూ.3,678 బిల్లు అదనంగా వేశారు. ఇలా ఏడాదికోసారి రకరకాల చార్జీల పేరుతో బిల్లులు వేస్తే తాము ఎలా బతకాలని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో చాలా మంది వినియోగదారుల పరిస్థితి ఇలాగే ఉంది'.

- వేసవి తాపానికి రోజంతా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు
- ఏప్రిల్, మే నెలల్లో టార్గెట్‌ను మించి విద్యుత్ వినియోగం
- లోడ్ ఆధారంగా గృహ వినియోగదారులకు నోటీసులు

సాక్షి,పెద్దపల్లి: మీటరు తీసుకునే సమయంలో సూచించిన కిలోవాట్ల కంటే అధికంగా విద్యుత్ వినియోగించిన వారిపై చార్జిల మోత మోగుతుంది. రూ.వందల్లో వచ్చే బిల్లు నేడు రూ.వేలల్లో వస్తుండటంతో ఆందోళనకు గురవుతున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం ఇళ్లలో రోజంతా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు నిర్విరామంగా నడిపిస్తున్నారు. ఈ క్రమంలో బిల్లులు కాస్త ఎక్కువ వచ్చినా భరిద్దాములే అనుకున్నారు. కానీ మే నెలలో వాడిన కరెంటుకు గాను జూన్ తొలివారంలో వచ్చిన బిల్లును చూసి బెంబేలెత్తిపోతున్నారు. వాడిన కరెంటుతో పాటు అదనంగా విద్యుత్ వినియోగదారుల నుంచి వార్షిక కాషన్ డిపాజిట్ (ఏసీడీ)కింద వసూలు చేస్తుండటమే దీనికి కారణం. గతంలో కనెక్టెడ్ లోడ్ పెరిగిందంటూ డెవలప్‌మెంట్ చార్జిల పేరిట వసూళ్లపై వినియోగదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో అదనపు చార్జిల వసూలుపై సంస్థ వెనక్కితగ్గింది. పరిస్థితి సద్దుమణగడంతో ఇప్పుడు గతంలో కంటే ఎక్కువ యూనిట్లు వాడుతున్నారనే సాకుతో అడ్వాన్స్ కన్జంప్షన్ డిమాండ్ (ఏసీడీ) పేరుతో వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో వివిధ కేటగిరీల కనెక్షన్లు మొత్తం 3,06,200 ఉన్నాయి. మే నెలకు సంబంధించి వ్యవసాయానికి కరెంట్ వినియోగం తక్కువగానే ఉన్నా వేసవి తాపానికి ఇళ్లలో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు నడవడంతో 86.12 మిలియన్ యూనిట్లకు గాను 88.35 మిలియన్ యూనిట్లు వినియోగించినట్లు సమాచారం. దీంతో నిర్ణీత లోడ్‌కంటే అదనంగా విద్యుత్ వినియోగిస్తున్న వివిధ కేటగిరీలను గుర్తించి 10,835 మందికి నోటీసులు జారీ చేశారు.

జిల్లాలో..

గృహ వినియోగ కనెక్షన్లు	2.04 లక్షలు
వాణిజ్య సముదాయాలు	24,000
పరిశ్రమలు	1,500
వ్యవసాయం	73,000
వీధిదీపాలు, తాగునీటి పథకాలు	3,700
మొత్తం	306,200

అధిక వినియోగమే కారణం



విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, మెరుగైన సరఫరా కోసం చార్జిలు వసూలు చేస్తున్నాం. ఇంటికి కొత్త కనెక్షన్ తీసుకునే టప్పుడే వాడే విద్యుత్ సామర్థ్యానికి అనుగుణంగా మీటరు తీసుకోవాలి. ఏసీడీ చార్జిలు కేవలం సెక్యూరిటీ డిపాజిట్‌గానే వసూలు చేస్తున్నాం. వినియోగదారులు కనెక్షన్‌ను ఉపసంహరించుకునే సమయంలో డిపాజిట్ సొమ్ము వాపసు చేస్తాం. – సుదర్శన్, ఎస్ఈ

ఈ చార్జిలు ఎందుకంటే..

గృహావసరాల కోసం విద్యుత్ మీటరుకు దరఖాస్తు చేసుకునే సమయంలో తమ ఇంటి అవసరాలకు ఎన్ని కిలోవాట్లు విద్యుత్ అవసరమో అంతకు దరఖాస్తు చేసుకోవాలి. కానీ చాలా మంది తక్కువ సామర్థ్యం గల మీటర్లకు దరఖాస్తు చేసుకుంటారు. 240 వాట్ల ఒప్పంద లోడ్‌తో సర్వీస్ కనెక్షన్ పొందుతారు. అయితే తర్వాత అవసరాల దృష్ట్యా ఇంట్లో కొత్తగా వాషింగ్‌మిషన్, ఫ్రిజ్ తదితర విద్యుత్ ఉపకరణాల వాడకంతో, తాము దరఖాస్తు సామర్థ్య మీటర్ల కంటే అధికంగా విద్యుత్ వినియోగిస్తున్నారు. దీంతో కనెక్షన్ పొందిన ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ పెరిగి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. వీటిని సవరించడానికి విద్యుత్ అధికారులు మరో కొత్త 100కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి వస్తుంది. వీటి ఏర్పాటుకు సంస్థలకు దాదాపు రూ.3లక్షల అదనపు భారం పడుతుంది. దీంతో డెవలప్‌మెంట్ చార్జిలు, సెక్యూరిటీ డిపాజిట్ కింద వినియోగదారు నుంచి వసూలు చేస్తున్నారు. దీనిపై అవగాహన కల్పించకపోవడంతో వినియోగదారులు తమకు బిల్లులు అధికంగా వస్తున్నాయని లబోదిబోమంటున్నారు. కాగా ఇళ్లలో వాడుతున్న విద్యుత్ ఉపకరణాల గురించి తెలియజేసి లోడును క్రమబద్ధీకరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మరో పక్క అదనపు బాదుళ్లతో అద్దె ఇళ్లలో ఉన్న వారికి, యజమానులకు ఎవరు చెల్లించాలనేదానిపై గొడవలకు దిగుతున్నారు.

న్యూస్‌రీల్

చెరువుల పరిశీలన



కాచాపూర్ చెరువును పరిశీలిస్తున్న సాగు నీటిపారుదల అధికారి శ్రీనివాస్

జూలపల్లి(పెద్దపల్లి): తెలంగాణ అవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండగను పురస్కరించుకొని గురువారం మండలంలోని కాచాపూర్, వడ్కాపూర్, కుమ్మరికుంట చెరువులను జిల్లా సాగునీటి పారుదల అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. ఈసందర్భంగా కార్యక్రమంలో తీసుకోవలసిన చర్యలను వివరించి సలహాలు సూచనలు చేశారు. ఆయా గ్రామాల్లో కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఏర్పాటు చేసిన భోజన వంటలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో వేణుగోపాలరావు, ఎంపీవో కిరణ్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని బీసీ కుల, చేతివృత్తుల వారికి రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈనెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సంగీత కోరారు. తొలివిడతలో నాయీబ్రాహ్మణ, రజక, సగర ఉప్పర, కుమ్మరి, అవుసుల, కంసాలి, కమ్మరి, కంచరి, వడ్రంగి, కృష్ణబలిజ, పూసల, మేదర, వడ్డెర, ఆరెకటిక, మేర, ఎంబీసీ కులవృత్తుల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత ఐదేళ్ల కాలంగా ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం పొందినవారు అనర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు దారులు 18 నుంచి 55 ఏళ్లలోపు వయసు ఉండి వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.లక్షా 50వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలు ఉండాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు కుల, ఆదాయ, ఆధార్, ఆహారభద్రత కార్డు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, బ్యాంకు పాసుబుక్ జతచేయాలని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయండి



ధాన్యం పరిశీలిస్తున్న డీసీఓ మైఖల్ బోస్

మంథని: వర్షాలు పడే సూచనలు ఉన్న నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోళ్లను వెంటనే పూర్తి చేయాలని జిల్లా సహకార అధికారి మైఖల్ బోస్ సూచించారు. మంథని పీఏసీఎస్ పరిధిలోని మంథని మార్కెట్ యార్డు, మండలంలోని గోపాల్‌పూర్, చిన్న ఓదాల కొనుగోలు కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు. వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలని, జిల్లాలో అత్యధికంగా కేంద్రాలు నిర్వహిస్తున్న సంఘం మంథని కావడంతో ఇక్కడి ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కేంద్రాల ఇన్‌చార్జిలు వెనువెంటనే ధాన్యం తూకం వేస్తూ రైస్ మిల్లులకు తరలించాలన్నారు. నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్యాబ్ ఆపరేటర్లు ధాన్యం కొనుగోలు, ట్రాన్స్‌పోర్టు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఆయన వెంట మానిటరింగ్ అధికారి ముఫాసిర్ అహ్మద్, సంఘం కార్యనిర్వాహణ అధికారి మామిడాల అశోక్‌కుమార్ ఉన్నారు.

10న మెగా జాబ్ మేళా

గోదావరిఖనిటౌన్(రామగుండం): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎస్ఐఆర్ ఫౌండేషన్ చైర్మన్ తమ్మెర మన్మోహన్ తెలిపారు. 30కి పైగా కంపెనీలతో మూడువేలకు పైగా ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులకు 18–35 ఏళ్ల వయస్సు ఉండాలన్నారు. 10, 12వ అండర్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, బీఫార్మా, ఎంఫార్మా, హోటల్ మేనేజ్‌మెంట్, డ్రైవర్స్, బీఈ, బీటెక్, ఎంటెక్, బీఏ, బీఎస్సీ, బీకాం, ఎంబీఏ, ఎంసీఏ, ఎంసీఎస్, పీజీ అర్హత కలిగిన నిరుద్యోగులు 10న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 88861 11981, 88867 11991 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఏడాది లీజు రూ.1.65 లక్షలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని శ్రీసీతారామస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబరు 934లోని 11.24 ఎకరాల ఖుష్కి భూమిని ఏడాది కాలం కోసం రూ.లక్షా 65వేలకు లీజుకు ఇచ్చినట్లు ఆలయ ఈఓ ముద్దసాని శంకరయ్య తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి హేమంత్‌కుమార్

పెద్దపల్లిరూరల్: న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో కక్షిదారులు రాజీ పడేందుకు ఈనెల 10న జాతీయ మెగాలోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్ తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయస్థానంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మనిషికి నూరేళ్లు, వ్యాజ్యానికి వెయ్యేళ్లు అన్న నానుడి ఉందన్నారు. ఏదైనా కేసు విషయంలో న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేసుకునేందుకు అవకాశముందన్నారు. అయితే చిన్నచిన్న కేసుల విషయంలో పంతాలు పట్టింపులు కాకుండా సామరస్యపూర్వకంగా చర్చించుకుని పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌లు అవకాశం కల్పిస్తున్నాయన్నారు. ఈనెల 10న న్యాయస్థానాల్లో నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు మంచిర్యాలకు వెళ్లే వాహనాల మళ్లింపు

గోదావరిఖని(రామగుండం): రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన మంచిర్యాలలో ఉన్న నేపథ్యంలో శుక్రవారం గోదావరిఖని నుంచి వెళ్లే వాహనాల మళ్లింపు చర్యలు తీసుకుంటున్నట్లు రామగుండం ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. సీఎం కేసీఆర్ సీసీసీ నస్పూర్‌లో కలెక్టరేట్ ప్రారంభిస్తున్న క్రమంలో సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందన్నారు. గోదావరిఖని నుంచి మంచిర్యాల వైపు వెళ్లే వాహనదారులు శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ వద్ద ఉన్న నేషనల్ హైవే ఫ్లైఓవర్ మీదుగా క్యాతనపల్లి గాంధారివనం నుంచి వెళ్లాలన్నారు. మంచిర్యాల నుంచి గోదావరిఖని వైపు వచ్చే వాహనదారులు మంచిర్యాల్ ఐబీ చౌరస్తా నుంచి క్యాతనపల్లి గాంధారి వనం వద్ద గల నేషనల్ హైవే ఫ్లైఓవర్ మీదుగా శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ నుంచి వెళ్లాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసుశాఖకు సహకరించాలని కోరారు.

మండుటెండల్లోనూ జలకళ



గర్రెపల్లిలో బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ సంగీత, గ్రామస్తులు తదితరులు

- కలెక్టర్ సంగీత

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): మండుటెండల్లోనూ చెరువులు నీటితో కళకళలాడడం సంతోషంగా ఉందని కలెక్టర్ సంగీత అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో నిర్వహించిన చెరువుల పండుగ కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు గ్రామస్తులు బోనాలు, బతుకమ్మలతో స్వాగతం పలికారు. గ్రామస్తులతో కలెక్టర్ బతుకమ్మ ఆడి వారిలో ఉత్సాహం నింపారు. గ్రామాల్లో చెరువులు బాగుంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, రైతులతో పాటు సంబ్బంధ వర్గాల వారికి ఉపయోగం ఉంటుందన్నారు. ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రత్యేక రాష్ట్రంలో భారీ ప్రాజెక్టుల నిర్మాణంతోపాటు చిన్న నీటిపారుదల రంగంలో మిషన్ కాకతీయ ద్వారా బలోపేతం చేయడంతో రైతులకు, ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. ఎంపీపీ బాలాజీరావు, సర్పంచ్ వి.సుజాత, ఎంపీటీసీ పులి అనూష, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా ఉపాధి అధికారి తిరుపతిరావు, ఎంపీడీవో శశికళ తదితరులు పాల్గొన్నారు.

మా భూములు లాక్కోవద్దు



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మంథని: ముప్పై ఏళ్లకు పైగా తమ ఆధీనంలో ఉన్న భూమిని లాక్కోవద్దని, రెవెన్యూ అధికారులు చదును చేయించి మరొక్కరికి కేటాయించేందుకు ప్రయత్నాలు చేయడం సరికాదని మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామస్తులు సర్వేను అడ్డుకున్నారు. గ్రామంలోని సర్వే నం.32లో 5.33 ఎకరాల్లో 2 ఎకరాలు ఖాళీగా ఉండగా రెవెన్యూ అధికారులు ఆ భూమిని చదును చేసి గ్రామంలోని నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులైన నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేసేందుకు అధికారులు కసరత్తు చేశారు. ఈ క్రమంలో గురువారం రెవెన్యూ సర్వేయర్ అనిల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ త్రివేణి గ్రామానికి వెళ్లగా సర్వే పనులను గ్రామస్తులు అడ్డుకొని నిరసన తెలిపారు. సర్వేను అడ్డుకోవడం సరికాదని, 140 మంది దరఖాస్తులు అందించారని, అందులో 27 మంది మాత్రమే అర్హులుగా తేలారని తహసీల్దార్ ప్రకాష్ తెలిపారు. గ్రామంలో ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైతే పట్టాలు అందిస్తామని పేర్కొన్నారు.

నేడు సంక్షేమ సంబురాలు

పెద్దపల్లిరూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లాలో సంక్షేమ సంబురాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సంగీత తెలిపారు. నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సంబరాలు నిర్వహించాలన్నారు. పెద్దపల్లి నియోజకవర్గ కేంద్రమంలోని నందనగార్డెన్, రామగుండంలో సింగరేణి కమ్యూనిటీ హాల్, మంథనిలో ఎస్ఎల్‌బీ ఫంక్షన్‌హాల్‌లో సంబరాల కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. మండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు పెద్దపల్లిలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

'కాళేశ్వరం'తో నిండుకుండలా చెరువులు

- విజన్ ఉన్న నాయకుడు సీఎం కేసీఆర్
- మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం(ధర్మపురి): కాళేశ్వరం ప్రాజెక్టుతో వేసవికాలంలో సైతం చెరువులన్నీ నిండుకుండలా దర్శనమిస్తున్నాయని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. చెరువుల పండుగలో భాగంగా ధర్మారం మండల కేంద్రంలోని ఊరకుంట వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా సీఎం కేసీఆర్ పాలన ముందుకు సాగుతుందన్నారు. విజన్ ఉన్న నాయకుడు కేసీఆర్ కాబట్టి రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. గత పాలకుల పాలనలో చెరువుల్లో చుక్క నీరు కనిపించలేదని, తెలంగాణ వచ్చాక ప్రణాళికబద్ధంగా ప్రాజెక్టులతో పాటు చెరువులలోని పూడికలను తొలగిస్తూ మరమ్మతు చేయడంతో నీళ్లు సమృద్ధిగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచు పుస్కూరి జితేందర్‌రావు, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూడండి



పోతారంలో డ్యాన్స్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ మధు

మంథని: గత ప్రభుత్వాల్లో జరిగిన అభివృద్ధి, ప్రస్తుతం చేపట్టిన సంక్షేమాన్ని గుర్తించాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు కోరారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మంథని మండలం గుంజపడుగు, పోతారం గ్రామాల్లో నిర్వహించిన చెరువుల పండుగ ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మంథని నియోజకవర్గంలో అద్భుత అభివృద్ధి జరిగిందన్నారు. ఈసందర్భంగా గుంజపడుగు, పోతారం గ్రామాల్లో మహిళలు బోనాలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించగా, జెడ్పీ చైర్మన్ చెరువుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పోతారంలో రూ.50లక్షలతో చేపట్టే రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభించారు. కాగా మండలంలోని నాగారంలో దశాబ్ది ఉత్సవాలను బహిష్కరించినట్లు గ్రామ సర్పంచ్ ప్రకటించగా, ఇక్కడ అధికారులు చెరువు పండుగను నిర్వహించారు. అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ ర్యాలీలో పాల్గొని చెరువు కట్టపై పూజల్లో పాల్గొన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే చందర్

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

పాలకుర్తి(రామగుండం): బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఈసాలతక్కళ్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనగా, మహిళలు బతుకమ్మ, బోనాలతో స్వాగతం పలికారు. సర్పంచ్ ముక్కెర రాజకుమారి, నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలకు అండగా సర్కార్

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి
- పెద్దపల్లిలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం



ఫుడ్ ఫెస్టివల్‌లో చేపల వంటకాలు చేస్తున్న మహిళలు



మత్స్యకార గ్రూపు మహిళలకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: మత్స్యరంగాన్ని అభివృద్ధి చేసి చేపల వృత్తిపై ఆధారపడి జీవించే మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో గురువారం ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక నర్సయ్యతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రంలో చెరువులను అభివృద్ధి చేసేందుకు మిషన్‌కాకతీయ పథకంతో పూడిక తీయించారని, దీంతో నిరంతరం చెరువులన్నీ నీటితో కళకళలాడుతున్నాయని వివరించారు. మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేందుకు సహకారం అందించాలని ఏటా ఉచితంగా చేపపిల్లలను అందిస్తోందన్నారు. చెరువుల్లో పెరిగిన చేపలను అమ్ముకునేందుకు వాహనాలు, ఐస్‌బాక్సులను అందించామని వెల్లడించారు. అంతేగాకుండా చేపలతో రకరకాల వంటలు తయారు చేసి అమ్ముకునేలా ఆసక్తి ఉన్న వారికి చేపలవంటలోనూ శిక్షణ ఇప్పించామన్నారు. ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం మత్స్యరంగ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించే బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లి సుభాష్‌నగర్‌లో చేపల కొనుగోళ్లు



గోదావరిఖని మార్కెట్‌లో..



ఎన్టీపీసీ రామగుండంలో..



ఐదు కిలోల చేపను కొనుగోలు చేసిన పెద్దపల్లి మహిళ

'మృగశిర' సందడి

పెద్దపల్లిరూరల్/జ్యోతినగర్/గోదావరిఖని టౌన్/కమాన్‌పూర్/సుల్తానాబాద్: మృగశిర కార్తె ప్రవేశించడంతో గురువారం చేపలకు గిరాకీ పెరిగింది. రోహిణి కార్తె ముగిసి మృగశిర ప్రవేశించిన రోజు చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో చేపలకోసం జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం వద్ద, గోదావరిఖని, ఎన్టీపీసీ రామగుండం, ఎఫ్‌సీఐ, యైటింక్లయిన్ కాలనీ, గంగానగర్ తదితర ప్రాంతాల్లో చేపల విక్రయ కేంద్రాల వద్ద జన సందడి నెలకొంది. మృగశిరకార్తె రోజు చేపలు తింటే ఆరోగ్యంగా ఉంటారనే నమ్మకం ఉండడంతో చాలా మంది వాటిని తినేందుకు ఆసక్తి కనబర్చారు. వ్యాపారులు బొమ్మరకం చేప కిలో రూ.500, రవు, బొచ్చ, కొర్రమీను, పాంప్లెట్, బంగారు తీగ తదితర రకాలను కిలో రూ.160నుంచి రూ.200 వరకు విక్రయించారు.

క్లుప్తంగా

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

మంథని: మంథని–కాటారం ప్రధాన రహదారి ఎక్లాస్‌పూర్ సమీపంలో లారీ బోల్తాపడిన ప్రమాదంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆజాంనగర్‌కు చెందిన డ్రైవర్ జాన్ గాయపడ్డాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం నుంచి మంచిర్యాల జిల్లా దేవాపూర్‌కు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న లారీ ఎక్లాస్‌పూర్ శివారులో డ్రైవర్ అజాగ్రత్త వల్ల బోల్తాపడింది. గాయపడిన డ్రైవర్‌ను స్థానిక సామాజిక వైద్యశాలకు తరలించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టెండర్ల ఆహ్వానం

జూలపల్లి(పెద్దపల్లి): ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాన్న భోజన పథకంలో భాగంగా వంట ఏజెన్సీలకు సరుకులు సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి మాధవి తెలిపారు. పాఠశాలల్లో ఫుడ్‌గ్రేన్స్, కూరగాయలు, గుడ్లు సరఫరాకు ఈ నెల 14లోపు టెండర్లు దాఖలు చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు కలెక్టరేట్‌లోని రూం నంబర్ 320లో సంప్రదించాలని సూచించారు.

వివాహం అడ్డగింత

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ గంగిరెడ్డుల కాలనీలో ఓ మైనర్ యువకుడి వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. వివరాల్లో వెళ్తే.. గ్రామానికి చెందిన ఓ యువకుడికి (19) అల్గునూర్‌కు చెందిన అమ్మాయి (21)తో గురువారం వివాహం జరుగనుంది. గ్రామస్తుల సమాచారంతో ఐసీడీఎస్ అధికారులు చేరుకొని వివాహాన్ని అడ్డుకున్నారు. అమ్మాయి మేజర్ కాగా అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకపోవడంతో వివాహాన్ని నిలిపివేయాలని వారు సూచించారు. వీరి వివాహంతో పాటు మరో పెళ్లి కూడా ఆగిపోయింది. కుండమార్పిడి (ఇటు అమ్మాయి అటువైపు, అటు అమ్మాయి ఇటు వైపు) వివాహం కూడా నిలిచిపోయింది. ఐసీపీఎస్ శాంత, ఏసీడీపీఓ అరవింద, ఆర్‌ఐ శైలజ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రాజశ్రీ, ఇందిర, పోలీసు సిబ్బంది, తదితరులున్నారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

కోరుట్ల: కోరుట్ల మండలం యూసుఫ్‌నగర్‌కు చెందిన గీత కార్మికుడు తుమ్మల్ల పురుషోత్తం (42) గురువారం తాటిచెట్టు పైనుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పురుషోత్తం రోజూలాగే గురువారం తాటి చెట్టు ఎక్కి కల్లు తీసుకరావడానికి వెళ్లాడు. ఈక్రమంలో సాయంత్రం బలమైన ఈదురుగాలికి మోకు జారిపోవడంతో కిందికి జారి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య వసంత, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు కోరారు.

కరువు భత్యం చెల్లించండి



మేడిపల్లి గ్రామస్తులతో ఎంపీ వెంకటేశ్ నేతకాని

జ్యోతినగర్(రామగుండం): మేడిపల్లి గ్రామ భూనిర్వాసితులకు వెంటనే కరువు భత్యం చెల్లించాలని సంబంధిత అధికారులను పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకాని ఫోన్‌లో ఆదేశించారు. మేడిపల్లి ఎస్సీ కాలనీ భూ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని కోరుతూ సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకుడు దుర్గం నగేశ్ ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాలలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా ఓసీపీ–4 విస్తరణకు మేడిపల్లి ఎస్సీ కాలనీ ప్రజల సాగు భూమితో పాటు నివాస స్థలాలను సింగరేణి యాజమాన్యం తీసుకొని ఎలాంటి పునరావాసం, కరువు భత్యం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని ఎంపీకి వివరించారు. స్పందించిన ఎంపీ సంబంధింత అధికారులతో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ గురించి ఫోన్‌లో మాట్లాడారు. వీలైనంత త్వరగా నిర్వాసితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ నిర్వాసితులు అధైర్యపడవద్దని, తప్పకుండా సీఎం కేసీఆర్ అందరికీ న్యాయం చేస్తారని, నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమతా సైనిక దళ్ నాయకుడు బండారి శివశంకర్, మేడిపల్లివాసులు సానపురి శ్రీనివాస్, రామటెంకి మల్లేష్, మేకల లింగయ్య, శివరామకృష్ణ పాల్గొన్నారు.

'మద్యం దినోత్సవం నిర్వహించాలి'



డాక్టర్ నగేశ్

ధర్మారం(ధర్మపురి): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం మద్యం దినోత్సవాన్ని నిర్వహించాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ ఎద్దేవా చేశారు. గురువారం ధర్మారంలో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన 2014 సంవత్సరంలో రాష్ట్రానికి మద్యం ద్వారా రూ.పదివేల కోట్ల ఆదాయం రాగా, కేసీఆర్ పాలనలో మద్యం ద్వారా రూ.45వేల కోట్లకు చేరిందన్నారు. దీంతో ప్రజారోగ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మద్యం అమ్మకాలను నియంత్రించాల్సిన ప్రభుత్వం కేవలం ఆదాయం కోసం విచ్చల విడిగా అమ్మకాలను కొనసాగిస్తుందని ఆరోపించారు. 24 గంటలు మద్యం అమ్మకాలను కొనసాగిస్తూ తెలంగాణను లిక్విడ్ రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. బంగారు తెలంగాణకు బదులుగా తాగుబోతుల రాష్ట్రంగా తయారు చేశారని, మారుమూల గ్రామాల్లో మంచినీరు దొరక్కున్నా మద్యం దొరుకుతుందన్నారు. మద్యం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిందని వాపోయారు. ఆయన వెంట నాయకులు వినోద్, సంతోష్ తదితరులు ఉన్నారు.

రైల్వే విద్యుత్ వైర్ల చోరీ ముఠా పట్టివేత

జగిత్యాలక్రైం: కొంతకాలంగా జిల్లాలో రైల్వే ట్రాక్ వెంట ఉన్న విద్యుత్ వైర్లు దొంగిలిస్తున్న ముఠాను బ్లూకోల్ట్స్ సిబ్బంది పట్టుకొని రైల్వే పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల రైల్వేస్టేషన్ సమీపంలో ఇటీవల రూ.10లక్షల విలువైన రైల్వే లైన్ విద్యుత్ రాగి వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లడంతో రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. మల్యాల–నూకపల్లి మధ్య బుధవారం అర్ధరాత్రి ముగ్గురు రైల్వే పోలీసులు తనిఖీ చేస్తుండగా ఏడుగురు దొంగలు విద్యుత్ వైర్లు చోరీ చేస్తూ కనిపించారు. వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా వారిపై రాళ్లు రువ్వి పారిపోయారు. దీంతో రైల్వేపోలీసులు డయల్ 100కు కాల్ చేసి మల్యాల బ్లూకోల్ట్స్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో గాలింపు చేపట్టారు. రాజారం వైపు వెళ్తున్న గోదావరిఖనికి చెందిన ఏడుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. వారి డ్రెస్‌లు, చేతులను క్షుణ్ణంగా పరిశీలించడంతో వారే దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారణ అయింది. నిందితులను రైల్వే పోలీసులకు అప్పగించారు. పూర్తిస్థాయిలో విచారిస్తే అసలు నిజాలు వెలుగుచూడనున్నాయి.

వ్యవసాయబావి ఒడ్డున మొసలి



బావి వద్ద మొసలి

కథలాపూర్(వేములవాడ): మేడిపల్లి మండలం తొంబర్రావుపేట గ్రామశివారులో రైతు చిట్టెడి సతీశ్‌కు చెందిన వ్యవసాయ బావి ఒడ్డున గురువారం మొసలి కనిపించింది. వెంటనే వ్యవసాయ బావిలోకి వెళ్లడంతో రైతులు భయాందోళనకు గురై అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వచ్చి పట్టుకునేందుకు యత్నిస్తున్నారు. బావిలో నీరు ఎక్కువగా ఉండటంతో మొసలిని పట్టుకునేందుకు కష్టంగా ఉందని, బావిలోని నీటిని విద్యుత్ మోటార్‌తో తొలగిస్తున్నట్లు రైతులు తెలిపారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన కరిగట్ల జమున(30) గురువారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కరిగట్ల జమునకు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. మానసిక స్థితి బాగా లేకపోవడంతో ఆమె భర్త నాలుగేళ్ల క్రితం విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి తన సోదరుడు గంగారాం వద్ద ఉంటూ జీవనం సాగిస్తోంది. మానసిక స్తితి బాగా లేకపోవడం, అనారోగ్య సమస్యలు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెంది గ్రామ శివారులోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బావిలో దూకే సమయంలో అక్కడే ఉన్న పసుల లక్ష్మణ్ గమనించి గ్రామస్తులకు తెలపగా ఆమెను బావిలో నుంచి బయటకు తీశారు. అప్పటికే ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జమున సోదరుడు గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్యేను నిలదీసిన రైతులు

పాలకుర్తి(రామగుండం): మండల కేంద్రంలో గురువారం రాత్రి రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను రైతులు నిలదీశారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో నిర్వహించిన చెరువు పండుగకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. చెరువు వద్ద గ్రామస్తులనుద్దేశించి మాట్లాడుతుండగా పలువురు అడ్డుకున్నారు. వరిధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు రైతులను తరుగు, తాలు, తేమ పేరుతో దోచుకున్నారని, అధికారంలో ఉన్న మీరు ఎందుకు స్పందించలేదని, అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయి రైతులు అవస్థలు పడ్డారని, కనీసం పరామర్శించలేదని వారు ఎమ్మెల్యేను నిలదీశారు. దీంతో కొద్దిసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. అనంతరం ఎమ్మెల్యే స్పందిస్తూ, కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నదని, రైతులు ఈవిషయాన్ని గమనించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుల కోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు పరుస్తున్నారని తెలిపారు. స్థానికుల జోక్యంతో వివాదం సద్దుమణిగిన అనంతరం ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయం వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన పల్లె మహేందర్‌రెడ్డి ద్విచక్రవాహనంపై పొలం నుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టడంతో శ్రీనివాస్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. యజమాని కారుతో పరారీ కావడంతో పోలీసులకు సమాచారం అందించారు. శ్రీనివాస్ రెడ్డికి ఈఎంటీ సతీశ్ రెడ్డి ప్రథమ చికిత్స అందించి 108లో హుజురాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలంలో కారు నంబర్ ప్లేట్ పడిపోవడంతో పోలీసులు కారు యజమాని అడ్రస్ కనుక్కున్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తికి జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): జమ్మికుంట మండలం నగురం గ్రామానికి చెందిన పొల్సాని తిరుపతి రావు తన ఇంటికి అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తుండగా విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీ నిర్వహించగా పట్టుబడ్డాడు. కరీంనగర్ విజిలెన్స్ పోలీసులు కేసు నమోదు చేసి మొదటి నేరం కింద రూ.వెయ్యి జరిమానా విధించి వదిలిపెట్టారు. మళ్లీ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ రెండోసారి పట్టుబడగా కేసు నమోదు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీవాణి ఎదుట విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో తిరుపతిరావుకు రూ.2,340 జరిమానా లేదా రెండునెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. ఆయనవెంట ఎస్సైలు ఎ.నిరంజన్‌రెడ్డి, టి.నరేశ్, సిబ్బంది ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం

గంగాధర: డివైడర్‌ను ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండలంలోని ఒద్యారం గ్రామంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్సై అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం... రామడుగు మండలంలోని దేశరాజుపల్లి గ్రామానికి చెందిన నిమ్మనవేణి శ్రీనివాస్ (40) భార్య మంజు, కూతురు సౌజన్యతో కలిసి బుధవారం వేములవాడ మండలంలోని కోనాయిపల్లి గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. అత్త లక్ష్మీ అక్కడికి రాగా గురువారం తెల్లవారుజామున తన ద్విచక్ర వాహనంపై దింపేందుకు శ్రీనివాస్ ఎలగందల గ్రామానికి వెళ్లాడు. తిరిగి కోనాయిపల్లికి వెళ్తుండగా ఒద్యారం గ్రామ శివారులోని ఎస్వీజీ గ్రానైట్ క్వారీ సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించాడు.

బొగ్గు బస్తాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బొగ్గు బస్తాలతో అధికారులు

గోదావరిఖని(రామగుండం): స్థానిక జనగామ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన బొగ్గు బస్తాలను గురువారం సెక్యూరిటీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. సెక్యూరిటీ అధికారి వీరారెడ్డికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేసి 200 బొగ్గు బస్తాలను రికవరీ చేశారు. దాడిలో జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఉమేష్, ఇంటెలిజెన్స్ అధికారి ఎన్.రాధాక్రిష్ణ, ఏసీటీఎస్ టీం సభ్యులు పాల్గొన్నారు. కాగా చాకచక్యంగా వ్యవహరించి బొగ్గు బస్తాలను స్వాధీనం చేసుకున్న సెక్యూరిటీ సిబ్బందిని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అభినందించారు.

ఓబీ వెలికితీతపైనే బొగ్గు ఉత్పత్తి

- వీడియో కాన్ఫరెన్స్‌లో డైరెక్టర్లు



కాన్ఫరెన్స్‌లో డైరెక్టర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి

గోదావరిఖని(రామగుండం): ఓసీపీల్లో ఓబీ తొలగింపుపైనే బొగ్గు ఉత్పత్తి ఆధారపడి ఉంటుందని సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆర్జీ–1 జీఎం కార్యాలయం నుంచి సింగరేణిలో ఓసీపీలు ఉన్న అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వర్షాకాలం వస్తున్న క్రమంలో సంబంధిత ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన చేయాలన్నారు. ఓవర్ బర్డెన్ తరలింపు సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై చర్చించారు. ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి పరోక్షంగా ఓబీ తొలగింపు కాంట్రాక్టర్ల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి చేయాలని, రాబోయే వర్షాకాలానికి సైడ్ డ్రెన్‌లు, సంప్‌లు, పంపుల మరమ్మతులు తదితర అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల కోసం జీవో నంబర్ 22ను రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ చేసి అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ మూడోజోన్ కాంట్రాక్ట్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులకు అన్ని హక్కులతో పాటు సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమావేశంలో వెంకటేష్, పద్మ, రాజనర్సు, సతీష్, నీలమ్మ, రాంబాయి, లలిత, శ్రీను, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి



సమావేశంలో నాయకులు

గోదావరిఖని(రామగుండం): సీఎం ఇచ్చిన హామీ ప్రకారం సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ నాయకులు ఎంఏ గౌస్, శనిగల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ–1 జీఎం ఆఫీస్ కార్యాలయంలో కాంట్రాక్టు కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఈనెల9న మంచిర్యాల జిల్లా పర్యటనకు వస్తున్న క్రమంలో సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా యాజమాన్యానికి తగిన ఆదేశాలు జారీ చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు కాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, పని స్థలాల్లో సౌకర్యాలు కరువయ్యాయని, హాస్పిటల్ సౌకర్యం సరిగా లేదన్నారు. సంస్థకు సాధించిన లాభాల్లో కాంట్రాక్టు కార్మికులకూ వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూన్ 11న నిర్వహించే చలో కొత్తగూడెం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయ, నాగమ్మ, భాగ్యలక్ష్మి, దిలీప్, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో విధులు నిర్వర్తించాలి

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 పరిధి అడ్రియాల గనిని గురువారం డీఎంఎస్(మైనింగ్) ఎస్.నాగేశ్వరరావు సందర్శించారు. గని లోపల పని స్థలాలను పరిశీలించి ఏలాంటి రక్షణ చర్యలు చేపడుతున్నారనే విషయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గని లోపల పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు తప్పనిసరిగా నియమాలు పాటిస్తూ, అనుక్షణం రక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం గనిపై డీఎంఎస్‌ను అధికారులు శాలువాలతో సన్మానించారు. డీఎంఎస్ వెంట డీడీఎంఎస్(మైనింగ్) బి.వెంకన్న, ఆర్జీ–3 సేఫ్టీ జీఎం ఎస్.సాంబయ్య, ఏపీఏ జీఎం .కె.వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజినీర్ సీతారామం, ప్రాజెక్టు అధికారులు రాధాకృష్ణ, నరేందర్, నాగేశ్వరరావు, జనార్దన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ ఒకరు మృతి

జ్యోతినగర్(రామగుండం): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి బలమైన గాయాలు కాగా, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. పాలకుర్తి మండలం కన్నాల గ్రామానికి చెందిన కలవేన అనిల్‌కుమార్(23) ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలో లేబర్ పనులు చేసుకుంటూ రోజు ఇంటి నుంచి బైక్‌పై వచ్చి వెళుతుంటాడు. ఈనెల 5న విధులు ముగించుకుని రాత్రి సమయంలో ఇంటికి వెళ్తుండగా మల్యాలపల్లె బస్‌స్టాప్ వద్ద రాజీవ్ రహదారిపై చీకటిలో నడుచుకుంటూ వెళ్తున్న ముగ్గురిని బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఒక పాదచారి కాలుకు గాయం కాగా, అనిల్‌కుమార్ తలకు, ఛాతీలో తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి బావ గోస్కుల రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం గుర్రాంపల్లికి చెందిన రావుల బతుకమ్మ (70) అనారోగ్యం బాధ భరించలేక బుధవారం తేజాబ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.